దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



ప్లాస్టిక్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఘట్‌కేసర్: ఇష్టానుసారంగా పారవేస్తున్న వ్యర్థాలపై ''వద్దన్న వినరే'' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్ పట్టణంలోని అన్నపూర్ణ, పరివార్ హోటల్, పలు కిరాణ, కూరగాయల దుకాణాలు, మండీలను తనిఖీ చేసి 50 ప్లాస్టిక్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్లను నిర్మూలించడంలో చేసిన కృషికి సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు



గుంతల్లో వెట్‌మిక్స్ వేసి చదును చేస్తున్న దృశ్యం

మేడ్చల్: ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు కమిషనర్ నిత్యానందం సోమవారం మరమ్మతులు చేయించారు. చాలా గ్రామాలకు వెళ్లే రోడ్లు వర్షాలతో దెబ్బతినడంతో వెట్‌మిక్స్ వేయించి గుంతలను పూడ్చివేయించారు. ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని వెంటనే మరమ్మతులు చేయించినట్లు కమిషనర్ తెలిపారు.

రోడ్డు సమస్యలు పరిష్కరించాలని వినతి



కీసర: దమ్మాయిగూడ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని మాజీ కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు దుర్గం సాయినాథ్‌గౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. వీధి దీపాల ఏర్పాటు తదితర స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ శుభపరిణామం



సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నేత

ఘట్‌కేసర్: జమ్ముకాశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ శుభపరిణామని మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అమెరికా ట్విన్ టవర్స్ ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి అమెరికాకు దశాబ్దకాలం పట్టిందని, పహల్గాం దాడి జరిగిన రోజుల వ్యవధిలో భారత సైన్యం ఉగ్రవాద శిబిరాలు, ఉగ్రవాదులను మట్టుబెట్టడం గర్వకారణమన్నారు. ముగ్గురు ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ చేసిన భారత సైనికులకు సెల్యూట్ అని, పహల్గాం ఉగ్రవాదులు ప్రపంచంలో ఎక్కడ దాగి ఉన్న వెంటబడి మట్టుబెడతామని ప్రధాని ఆనాడే ప్రతిజ్ఞ చేశారని గుర్తు చేశారు.

శుభ్రత పాటించని బేకరీకి జరిమానా



బేకరీలో లభ్యమైన కుళ్లిపోయిన గుడ్లు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని పలు హోటళ్లను మున్సిపల్ కమిషనర్ రాజేష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌తో కలిసి సందర్శించారు. సోమవారం ఓ బేకరీలో అపరిశుభ్రమైన వాతావరణంలో కుళ్లిపోయిన గుడ్లు, ఫ్రిజ్‌లో ఉంచిన ఉడికించిన గుడ్లు, దుర్వాసన వెదజల్లుతున్న చికెన్‌ను చూసి కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పలు మటన్ మండీలను తనిఖీ చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో తినుబండారాలు తయారు చేయడం, దుర్వాసన వస్తున్న ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేసినందుకు బేకరీ నిర్వాహకుడికి రూ. 7 వేల జరిమానా విధించారు.

దవాఖానాల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్!

ఆగస్టు 1 నుంచి అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈ నెల 31లోగా వైద్యులు, సిబ్బందికి శిక్షణపై కసరత్తు

సాక్షి,మేడ్చల్ జిల్లా: వైద్య సేవల్లో మరింత పారదర్శకతను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (ఏబీఏఎస్) విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆయా జిల్లా వైద్యారోగ్యశాఖ యంత్రాంగం ప్రభుత్వ ఆసుపత్రులతో సహా పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (ఏబీఏఎస్) విధానాన్ని ప్రవేశ పెట్టే దిశగా ఆలోచిస్తోంది.

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి (మల్కాజిగిరి)తో ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , 26 ప్రభుత్వ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి.
- రంగారెడ్డి జిల్లాలో ఓ కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఓ ఏరియా ఆసుపత్రి 9 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 55 పీహెచ్‌సీలు, 231 సబ్ సెంటర్లు, 57 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ఇవన్నీ వైద్య, విద్యా సంచాలకులు, వైద్య విధాన పరిషత్, ప్రజారోగ్య సంచాలకులు, ఆయూష్ విభాగాల పరిధిలో పనిచేస్తుండగా.. వీటన్నింటిలోనూ..'ఏబీఏఎస్' విధానాన్ని



ప్రవేశపెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి సంబంధించి వైద్యులు, సిబ్బందికి ఈనెల 31లోగా అవసరమైన శిక్షణ అందించనుంది.

పారదర్శకతే లక్ష్యంగా..

ప్రస్తుతం దవాఖానాల్లో వైద్యులు, సిబ్బందికి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు అమలు పరుస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన సమయంలో తిరిగి వెళ్లేటప్పుడు హాజరు వేస్తున్నారు. ఈ విధానంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని ప్రభుత్వం గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ విధానం ద్వారా డాక్టర్లు, సిబ్బంది తమకు నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా వైద్యసేవలు అందించడంతో పాటు ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తోంది.

సమయపాలన లేకపోవడంతో కష్టాలు

మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా కమ్యూనిటీహెల్త్ సెంటర్, పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల ద్వారా ప్రజలు అంతంత మాత్రంగానే వైద్య సేవలను పొందుతున్నారు. గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్యవేక్షణ కొరవడటంతో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించక రోగులు వైద్య పరీక్షలు, ఇతర వైద్య సేవల కోసం నిరీక్షించాల్సి వస్తుంది.

మచ్చుకు కొన్ని.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా, ఇందులో 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని, జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటున్నప్పటికీ, ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. జిల్లాలో 24 గంటలు (రౌండ్ ది క్లాక్) ఆసుపత్రులు 12 ఉండగా, ఇందులో 4 ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరికొన్నింటిలో ఆలస్యంగా వారు రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లాలో కూడా నెలకొంది. ఈ నేపథ్యంలోనే సర్కారు దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు వైద్య సేవల్లో మరింత పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం 'ఏబీఏఎస్' విధానం అమలుకు కసరత్తులు చేస్తుంది.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



ఘట్‌కేసర్‌లో పనులు ప్రారంభిస్తున్న పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డు ఎన్ఎఫ్‌సీనగర్, చందుపట్లగూడలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇళ్ల పనులను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. మాజీ కౌన్సిలర్లు సంగీత, మల్లేష్, కాంగ్రెస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వెంకటేష్‌ముదిరాజ్, అంజిరెడ్డి, రమేష్, శ్రీనివాస్, సునీల్, సాయిచరణ్, కిషన్, సత్తిరెడ్డి, భవానీ, హీరాలాల్, నర్సింహ్మారెడ్డి, బాబు, లాజరీస్, వివేక్‌రెడ్డి, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల సందర్శన



ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు సరిత, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డితో కలిసి సోమవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలలో కల్పించిన సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించి చేతులు కడుక్కోవడం, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కీసర: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ పుష్పలత ఆధ్వర్యంలో సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అంజనాద్రినగర్‌లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన కల్పించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికి వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. రోడ్డుకు ఇరుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళీ, మున్సిపల్ మేనేజర్ వెంకటేషం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ పుష్పలత

ప్రభుత్వ స్కూళ్లల్లో పెరిగిన అడ్మిషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శంకరయ్య

మేడ్చల్: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయని, దీంతో బాధ్యత మరింత పెరిగిందని ఎంఈఓ శంకరయ్య అన్నారు. సోమవారం మేడ్చల్‌లో మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఈ ఏడాది విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగిందని 29,262 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ పటిష్టంగా చేయాలని, మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కొరత లేకుండా చూడాలన్నారు. మిడ్‌లైన్ టెస్టులు లక్ష్యంగా పెట్టుకుని బోధన చేయాలని సూచించారు.

పల్లె దవాఖానాను ప్రారంభించాలి



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

జవహర్‌నగర్: కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్‌లో పల్లె దవాఖానాను నిర్మించి నిరుపయోగంగా ఉంచారని, వెంటనే ప్రారంభించాలని బీజేపీనేతలు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ప్రజావాణి వినతిపత్రం ఇచ్చారు. స్థానికంగా గర్భిణులు, చిన్న పిల్లలకు ఇంజక్షన్, వైద్యం కోసం దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. వెంటనే పల్లె దవాఖానాను ప్రారంభించి పేదలకు వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. జవహర్‌నగర్ బీజేపీ ఈస్ట్ అధ్యక్షుడు జోగారావు, ఇన్‌చార్జి శోభారెడ్డి, వెస్ట్ అధ్యక్షుడు కమలాకర్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, యాదగిరి, రామునాయక్, శ్రీధర్, మహేశ్వరిగౌడ్, లలిత, శ్యామల, వంశీ తదితరులున్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు

ఉప్పల్: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సత్యనగర్ విజయపురి కాలనీలో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. సోమవారం కాలనీవాసులకు మంజూరుపత్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి అందజేశారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. నరేందర్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, సుంకు శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దె గదుల్లో అంగన్‌వాడీలు

- నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న పిల్లలు, గర్భిణులు
- 793 అంగన్‌వాడీ కేంద్రాలు, 78,885 మంది లబ్ధిదారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె డబ్బులు చెల్లించకపోవడం ఓ వంతు అయితే.. సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరైన వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల (హెల్పర్లు)కు కూడా నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 68,913 మంది, గర్భిణులు, బాలింతలు 9,972 మంది ఉన్నారు. మొత్తంగా 78,885 మంది ఉండగా.. ఇందులో కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ పరిధిలో 313 కేంద్రాలు ఉండగా.. 33,226 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 15,481 మంది, అల్వాల్ పరిధిలో 269 అంగన్‌వాడీ కేంద్రాల్లో 30,178 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

సొంత భవనాలు లేనివే అధికం..

793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

- అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

తాగునీటికి ఇబ్బందే..

మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీటి సదుపాయం లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది.

శానిటేషన్ అంతంత మాత్రమే..

మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల సమస్య తీవ్రంగా ఉంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో యజమానులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు.

వైభవంగా రంగనాయకస్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణ వేడుకలు



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గోదాసమేత రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అమ్మవారు, స్వామివారిని నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ధర్మకర్తలు తిరువదండం పోరెత్తి వంశస్తుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అధికారి మారినా.. మారని తీరు

మల్కాజిగిరి: సర్కిల్ ఉప కమిషనర్‌గా అధికారి మారినా ప్రజావాణి తీరు మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది. గతంలో ఇక్కడ పనిచేసిన డీసీ బదిలీ తర్వాత వచ్చిన నూతన డీసీ జకియా సుల్తానా ఆధ్వర్యంలో తొలిసారి ప్రజావాణి కార్యక్రమం జరిగింది. అన్ని విభాగాల అధికారులు పాల్గొనాల్సి ఉండగా.. సగం మంది కూడా హాజరు కాలేదు. కేవలం గతంలో ఫిర్యాదు చేయడమే తప్పా.. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇప్పుడైనా ఆ విధానం మారాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కీసరగుట్టలో విశేష పూజలు

కీసర: శ్రావణమాసం సందర్భంగా కీసరగుట్టలో కొలువైన భవానీరామలింగేశ్వరస్వామికి అర్చకులు విశేష పూజలు చేశారు. సోమవారం ఉదయం గర్భాలయంలో కొలువైన మూలవిరాట్‌కు తొలి శ్రావణ సోమవారం సందర్భంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అనంతరం శివాభిషేకం నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.



నాగారం తదితర ప్రాంతాల నుంచి మార్వాడి కులస్తులు పెద్దఎత్తున కీసరగుట్టకు కావడి పూజలో భాగంగా గంగాజలంతో అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లభ్యం

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన బాలుడు

శామీర్‌పేట్: తప్పిపోయిన బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు శామీర్‌పేట పోలీసులు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే...మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బందికి మూడుచింతలపల్లి వద్ద ఆదివారం సాయంత్రం 12 ఏళ్ల తప్పిపోయినట్లు బాలుడిని గుర్తించారు. దీంతో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి, విచారించగా పేరు 'బన్నీ' అని, తల్లి పేరు రేణుకగా తెలుసుకున్నారు. బాలుడు ఇచ్చిన సమాచారంతో సమీప పోలీస్ స్టేషన్లతో మాట్లాడారు. బాలుడిది జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెన్నాపూర్‌కు చెందినట్లు గుర్తించారు. సోమవారం తల్లిదండ్రులకు బాలుడిని పోలీసులు అప్పగించారు.



దెబ్బతిన్న రోడ్డు !

అవస్థలు పడుతున్న వాహనదారులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌కు మేడ్చల్ నుంచి వెళ్లాలంటే వాహనదారులు నరకయాతన పడాల్సి వస్తుంది. రోడ్డంతా గుంతలమయంగా మారడం, 10 అడుగులకు గుంతలు ఉండటంతో వాహనదారులు 2 కిలోమీటర్ల ప్రయాణానికే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మేడ్చల్‌లోని రైల్వే బ్రిడ్జి నుంచి గిర్మాపూర్‌కు రోడ్డు ప్రారంభం కాగా.. గిర్మాపూర్, రాయిలాపూర్ వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ముందే గుంతలమయంగా ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు బీటీగా ఉన్న గుంతలతో ప్రయాణానికి అనుకూలంగా లేకుండా పోయింది. అధికారులు తగిన మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మేడ్చల్ -గిర్మాపూర్ రహదారి

పరిష్కారమవుతాయనే ఆశ !

కలెక్టరేట్ ప్రజావాణిలో 80 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న కొండంత ఆశతో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలు, బస్తీలు, పురపాలికల నుంచి తరలివచ్చిన మహిళలు, ప్రజలు 80 ఫిర్యాదులను అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కలెక్టర్ పరిష్కరించగలరన్న ధీమాతో తమ వినతులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి అందజేశారు.

పురపాలికలు నుంచే అధికం

జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని 8 మున్సిపల్ సర్కిళ్లు ఉండగా.. ఇక్కడ నుంచే అధికంగా 22 ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి. గతంలో ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులపై సరైన సమీక్షలు లేకపోవడంతో పాటు నిర్లక్ష్యం వంటి కారణాల నేపథ్యంలోనే మూకుమ్మడిగా ప్రజలు దరఖాస్తు చేసుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

- తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని సర్వే నంబర్లు 286, 332లోని 8 ఎకరాల 4 గుంటల భూమిలో 2017లో వెంచర్ వేయగా.. ఇందులోని రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి ,బోర్‌వేసి చెట్లు పెంచుతున్నారని స్థానికులు, రెడ్డి అసోసియేషన్ ప్రతినిధులు రత్నాకర్‌రెడ్డి, పోలిరెడ్డి, శివకుమార్‌లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రోడ్డులోనే బోరు వేసి, చెట్లను పెంచుతున్న వారిపై చర్యలు తీసుకుని, కబ్జా నుంచి రోడ్డును కాపాడాలని కలెక్టర్‌ను కోరారు.
- సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై కూడా వినతులు సమర్పించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి సమస్యలు పరిష్కారం కాగలవన్న నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులుగా మనపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో దరఖాస్తుదారులకు తెలపాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. వినతులపై చేపట్టిన చర్యల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో భద్రంగా పొందుపరచాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.